క్రైస్ కథోత్సవం - 2006
కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి
పొందిన కథ

# సహజీవనం

పాలపర్తి జ్యోతిష్మతి




బాబు లూసీమీదికి చెప్పు విసిరేశాడు. అది నోటిలో కరుచుకున్న పుస్తకం అక్కడ వదిలేసి 'కుంయ్ కుంయ్' మంటూ దూరంగా వెళ్ళి నిలబడింది. అప్పుడే వచ్చిన రాంబాబు పాలకేన్ నా చేతికిచ్చి, "ఏంటి బాబూ అట్లా కొట్టావు?" అంటూ లూసీని చేతుల్లోకి తీసుకున్నాడు.

"అది నా పుస్తకం తీసుకు పోతోంది. చింపేస్తే?" అన్నాడు బాబు.

"దానికేంతెలుస్తుంది బాబూ? దానికి అందకుండా మనమే జాగ్రత్తగా పెట్టుకోవాలి." అంటూ కింద కూర్చుని లూసీని ఒళ్ళోకి తీసుకుని ఆడుకోవడం మొదలు పెట్టాడు రాంబాబు.

రెండునెలల క్రితం స్నేహితుడి పుట్టినరోజు పార్టీకి వచ్చిన పిల్లలు వాళ్ళింట్లో వున్న బొచ్చుకుక్కపిల్ల గురించి వర్ణించి వర్ణించి చెప్పడం మొదలుపెట్టారు. "ఎంత బాగుందో! తెల్లబొచ్చు, బుల్లితోక, ఎంత ముద్దొస్తోందో! పిల్లలందరూ దాంతో బలే ఆడుకున్నారు. మాకు అలవాటు లేదు కదా? అందుకని భయమేసింది. మనింట్లో కూడా ఒక్క కుక్కపిల్ల ఉంటే మాకూ అలవాటయి ఉండేది. మేము కూడా ఎంజాయ్ చెయ్యగలిగేవాళ్ళం." అందరితో సమానంగా ఆడలేక పోయామన్న వెలితి వాళ్ళమాటల్లో ధ్వనించింది.

"సరేలే ! ఆదివారాలు వాళ్ళింటికెళ్ళి కాసేపు ఆడుకుందురు గాని, నెమ్మదిగా అలవాటవుతుంది."

"వాళ్ళింటికెళ్ళి ఆడుకుని అలవాటు చేసుకుంటే మాత్రం లాభమేముంది, మనమూ పెంచుకుంటే బాగుంటుంది కానీ?"

ఒక జంతువును ఇంట్లో ఉంచుకుని పెంచడమంటే ఎంత ఇబ్బందో ఎన్ని రకాలుగా చెప్పినా వాళ్ళు అర్థం చేసుకునే స్థితిలే లేరు.

'కుక్కపిల్ల మనిషితో సమానమే. అదీ మన కుటుంబంలో ఒక సభ్యురాలైపోతుంది.' అన్నట్లు మాట్లాడారు.

"మనమంతా కలిసి ఏదైనా ఊరు వెళ్ళాలంటే కుదరదు. దానికోసం ఎవరో ఒకరు ఆగిపోవాలి."

"మా ఫ్రెండ్స్ ఎవరికైనా అట్లాంటి అవసరం వస్తే ఇంకో ఫ్రెండ్ఇంట్లో దాన్ని వదిలి పెట్టి వెళ్తారు. మనమూ అట్లాగే చెయ్యొచ్చు."

"దానికి రోగాలు రాకుండా ఇంజెక్షన్లు చేయించాలి. ఏదైనా జబ్బు చేస్తే హాస్పటల్ చుట్టూ తిరగాలి."

"ఏం? మనపిల్లలకి ఇంజెక్షన్లు చేయించట్లేదా? మనకవసరమైతే హాస్పిటల్‌కి వెళ్ళట్లేదా?"

"మరి వారానికోసారన్నా స్నానం చేయించాలి గదా? ఆపని మీరు చూసుకుంటారా?"

"కాస్త అలవాటయ్యేదాకా నువ్వు సహాయం చేస్తే తరువాత అంతా మేమే చూసుకుంటాం."

కుక్కపిల్లని పెంచుకోడానికి ఒప్పుకునే దాకా ఊపిరాడన్విలేదు.

వాళ్ళగోల భరించలేక వాళ్ళనాన్నగారు లూసీని తీసుకువచ్చారు.దాన్ని చూసి మా పిల్లల కంటే ఎక్కువగా సంతోషించాడు రాంబాబు.ఆ రోజంతా మా ఇంట్లోనే వున్నాడు. బాబూ పాపా దాని దగ్గరికెళ్ళడానికి భయపడుతుంటే ధైర్యం చెప్పి అలవాటు చెయ్యడానికి ఎంతో ప్రయత్నించాడు.చివరికి "నాలుగురోజులైతే అదే అలవాటవుతుందిలే"అంటూ భరోసా ఇచ్చి వెళ్ళాడు.

నెమ్మదిగా చదువుధ్యాసలో పడి పిల్లలు దాన్ని పట్టించుకోడం మానేశారు.రెండుపూటలా అన్నంపెట్టడం,వారానికొకసారి స్నానం చేయించడం నా బాధ్యతలైపోయాయి. అది ఇంటికి వచ్చాక నాకు ఇల్లు జైలైపోయింది. తలుపు తీస్తే చాలు ఇంట్లోకి వచ్చేస్తుంది. అది ఇల్లంతా తిరుగుతూ, కాళ్ళకడ్డం పడుతూ, కనిపించిన ప్రతి వస్తువునూ నాకుతూ, కొరుకుతూ ఉంటే చిరాగ్గా ఉంటుంది. అందుకని దాన్ని వరండాలో పెట్టి తలుపేసేసి నేను ఇంట్లో మగ్గిపోతున్నాను. ఒక్కోసారి అనిపిస్తుంది– 'బాధ్యతగా దాని అవసరాలు చూస్తున్నాము కానీ దాన్ని ప్రేమగా చూడలేకపోతున్నాము. దాన్ని తీసుకువచ్చి తప్పు చేశామేమో' అని.అటువంటప్పుడు పిల్లల్ని కోప్పడుతుంటాను, "దాన్ని పట్టించుకోకుండా వదిలేస్తే ఎట్లా? కాసేపు దానితో ఆడుకోండి" అని. కానీ వాళ్ళకి దానిదగ్గరికి వెళ్ళాలంటేనే భయం. దానితో సమానంగా పరుగులు పెట్టి వాళ్ళు ఆడలేరు.

రెండుపూటలా పాలు తీసుకొచ్చినప్పుడు లూసీతో కాసేపు ఆడుకుని వెళ్ళడం రాంబాబుకి అలవాటయింది. మా పిల్లలు కిందా మీదా పడి చదివి క్లాసులో ఫస్టో, సెకండో వస్తే, రాంబాబు పశువుల్ని మేపి, ఇల్లిల్లూ తిరిగి పాలుపోసి, మిగిలిన టైములో చదివి – క్లాసులో ఫస్ట్ క్లాస్ మార్కులు తెచ్చుకుంటాడు. పరీక్షరోజులైనా సరే లూసీతో ఆటలు మాత్రం మానడు.

పాలకేన్ తెచ్చి రాంబాబు పక్కన పెట్టి వాణ్ణే గమనిస్తూ నిలబడ్డాను. లూసీని ఒళ్ళో కూర్చోపెట్టుకుని దాని నోట్లో వేళ్ళు పెడుతూ ఆడుతున్నాడు.

"కరుస్తుందేమో రాంబాబూ! నీకు భయమెయ్యదా?" ఆశ్చర్యంగా అడిగింది పాప.

"బర్రెల వెనకాల తిరిగేవాడు వాడికి కుక్కపిల్లంటే భయమేంటే!" ఎగతాళిగా అన్నాడు బాబు.

నేను రాంబాబువైపు చూశాను.చేతులు లూసీతో ఆడుతూనే ఉన్నాయి. తల వంచుకునే కళ్ళకొసల్లోంచి నావైపు చూస్తున్నాడు. "తప్పు. అట్లా మాట్లాడకూడదు." నోటి చివరిదాకా వచ్చిన మాటల్ని దిగమింగేసుకున్నాను.

రాంబాబు లూసీని బయటకు తీసుకు వెళ్ళాడు. కాంపౌండ్ అంతా పరుగెత్తుతూ, దాన్ని పరిగెత్తిస్తూ కేరింతలు కొడుతూ ఆడుతున్న వాణ్ణి చూస్తుంటే నాకే అసూయ కలుగుతోంది.

ఆడి ఆడి అలసిపోయి లూసీని తీసుకు వచ్చి వరండాలో వదిలి పాలకేన్ తీసుకుని వెళ్ళబోతూ, "పాపం ! బుజ్జిముండని కొట్టకండి బాబూ" అన్నాడు.

"ఏం? మీరు బర్రెల్ని ఎప్పుడూ కొట్టరా?" ఎగతాళి మిళితం చేసిన స్వరంతో అంది పాప.

ఈసారి రాంబాబు సూటిగా నావైపు చూశాడు. నేను లూసీని తీసుకెళ్ళే వంకతో కిందకి వంగాను.

"ఎందుకు కొడతాం? ఇష్టపడి పెంచుకునే జంతువుల్ని ఎవరూ కొట్టరు." గేటుదాకా వెళ్ళినవాడు వెనక్కి తిరిగాడు. "మేము బర్రెల్ని ప్రేమిస్తాం. కాబట్టే కుక్కల్ని కూడా ప్రేమించగలం."

పిల్లల ఎగతాళి మీద, నా భేషజం మీద కొరడాదెబ్బ కొట్టి వెళ్ళిపోయాడు రాంబాబు.

వాడి మాటలు నాకు "మీరు కుక్కల్ని ప్రేమించలేరు.కాబట్టే పాలుపోసే కుర్రాణ్ణి కూడా ప్రేమించలేరు." అన్నట్టు అనిపించాయి.

---

# రాజూ గైడ్

(పాతబస్తీ ఫకీరు)

ఎన్ని
దెబ్బలు తిన్నారు
ఎన్ని
రాత్రులు మరణించారు
ఒక్క పద్యం రాసినందుకు
రెక్కలు కట్టేసి తొక్కారు
మాధురీదీక్షిత్ కాదు
మనీషా కొయిరాలా కాదు
మా గల్లీ పిల్ల చెప్పింది
ఈ మబ్బుల్ని విడగొట్టింది

* * *

ఎక్కడో తల్లి
నిరీక్షిస్తుంది
ఆకాశం నిండా
కొడుకును
దర్శిస్తుంది
వర్షం కురిసినా
ఎండలు మండినా
తల్లి కళ్ళు
మోసపోవు
మాధురీదీక్షిత్ కాదు
మనీషా కొయిరాలా కాదు
మా గల్లీ పిల్ల చెప్పింది
ఈ మబ్బుల్ని విడగొట్టింది.

(అముద్రిత "రాజూగైడ్" లోంచి కొన్ని భాగాలు)

– ఆశారాజు